

## రెసిడెన్షియల్ విద్యాలయాల్లో తనిఖీకి

# ప్రత్యేక అధికారులు

### నియమించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్

**ప్రజానావ, సిరిసిల్ల :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలోని రెసిడెన్షియల్ విద్యాలయాల పక్కాగా నిర్వహణకు అలాగే వసతులు పరిశీలించేందుకు, మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో కలిసి తినేందుకు ప్రత్యేక అధికారులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ నియమించారు. జిల్లాలోని ఆయా మండలాలు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఇతర రెసిడెన్షియల్ విద్యాలయాల్లో తనిఖీ చేస్తూ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేయాలని, ఆయా హాస్టల్లో కనీస వసతులు పరిశీలించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రత్యేక అధికారులుగా వివిధ శాఖల అధికారులను నియమించారు. సోమవారం నుంచి మొదలు ఆదివారం వరకు ఒక్కో అధికారి ఒక్కో రోజున తమకు కేటాయించిన రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థులతో కలిసి భోజనం చేసి దాన్ని నాణ్యతను, కనీస వసతులు పరిశీలించనున్నారు.

## పెద్దూరు పాఠశాలలో ఉగాది వేడుకలు



**ప్రజానావ, సిరిసిల్ల :** ఎంపీహెచ్ఎస్ పెద్దూరు పాఠశాలలో పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడిని విద్యార్థులందరికీ అందించారు. ఉగాది పచ్చడిలోని ఆరు రుచులు లాగానే మన జీవితంలో కూడా కష్టనష్టాలు, సుఖశాంతులు, అన్ని రకాల భావోద్వేగాలు ఉంటాయని ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలియజేశారు. కొత్త సంవత్సరం ఉగాది తోనే ప్రారంభమవుతుందని, వసంత ఋతువుల విద్యార్థులందరి జీవితాలు చిగురించాలని ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు చక్రవర్తుల రమాదేవి విద్యార్థులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుండెల్లి రవీందర్, తోట శ్రీనివాస్, భాగ్యనగర్ మాధవి, లకావత్ ఉమా, బైరి వాణిశ్రీ, కడార్ల కల్పన, నాగుల వీణ, నందాల శంకర్, రాజమల్లు, రవికుమార్, గడ్డి మహేశ్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## తంగళ్లపల్లి పీహెచ్‌సీలో ఉచిత వైద్య శిబిరం విజయవంతం

### ప్రత్యేక వైద్య నిపుణులతో సేవలు




**ప్రజానావ, సిరిసిల్ల :** తంగళ్ళపల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో మంగళవారం నిర్వహించిన ఉచిత ఆరోగ్య శిబిరం విజయవంతం అయింది. "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల" కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక వైద్య నిపుణుల బృందం ఉచిత ఆరోగ్య శిబిరం ను సందర్శించి వ్యాధిగ్రస్తుల వివరాలు, నేత్ర సంబంధిత, దంత సంబంధిత, పిల్లల వైద్య నిపుణులు, స్త్రీల వైద్య నిపుణులచే పరీక్షించిన మొత్తం (255) వ్యాధిగ్రస్తులను పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ నాగేంద్రబాబు, డాక్టర్ అనిత, డాక్టర్ రామకృష్ణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ స్నేహ లు పాల్గొన్నారు.

## ఆసుపత్రి నూతన భవనం పరిశీలన

**ప్రజానావ, పెద్దపల్లి:** పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి, నందిమేడారం ఆసుపత్రి నూతన భవనాన్ని సూపరింటెండెంట్ సందర్శించారు. అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించారు. ప్రభుత్వం నుంచి ఆసుపత్రికి అందిన వైద్య పరికరాలను కూడా చూశారు. వాటి వినియోగంపై సంబంధిత అధికారులతో చర్చించారు. నందిమేడారం ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఈ ఆసుపత్రిని అత్యంత త్వరలో ప్రారంభించి అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఆసుపత్రి ప్రారంభానికి కావలసిన అన్ని ఏర్పాట్లు వేగవంతంగా పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. భవన నిర్మాణ పనులతో పాటు రోగులకు అవసరమైన సౌకర్యాలను సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నూతన భవనం అందుబాటులోకి వస్తే స్థానికులకు మెరుగైన వైద్యం అందుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఆసుపత్రి ప్రారంభంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# హామీలు అమలులో కాంగ్రెస్ విఫలం

- మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి
- రాష్ట్రవ్యాప్తంగా 937 మండల కేంద్రాల్లో బీజేపీ నిరసనలు




**ప్రజానావ, ఖైరతాబాద్:** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలుపై నిరసన వ్యక్తం చేస్తూ ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి షేక్‌పేట్ తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వె-ంమోరాండం సమర్పించారు. బీజేపీ పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మార్వో కార్యాలయాల్లో మెమోరాండాలు అందజేస్తున్నామని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనితీరు పూర్తిగా విఫలమైందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని విమర్శించారు. రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నా ప్రభుత్వం స్పందించడం లేదని, నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడంలో విఫలమైందని ఆరోపించారు. ధరల పెరుగుదలపై నియంత్రణ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అభివృద్ధి పనులు ఆలస్యమవుతుండగా, సంక్షేమ పథకాల అమలులో లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని అన్నారు. రెండు సంవత్సరాల నాలుగు నెలల కాలంలో ప్రజల సమస్యలను పక్కనబెట్టి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 62 సార్లు ఢిల్లీకి వెళ్లారని, ప్రజల సమస్యలను గాలికి వదిలేసి స్వప్రయోజనాలకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి రాష్ట్రంలోని 937 మండల కేంద్రాల్లో మెమోరాండాలు సమర్పించినట్లు తెలిపారు. ప్రజల సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# ఘనంగా ఇఫ్తార్ విందు

### హాజరైన ఎమ్మెల్యే పద్మారావు గౌడ్




**ప్రజానావ, సికింద్రాబాద్:** సికింద్రాబాద్‌లోని వారసిగూడా కౌసర్ మసీద్ వద్ద మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో సికింద్రాబాద్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోజా పేరిట నిర్వహించే ఉపవాస దీక్షలు విశిష్ట సంప్రదాయానికి ప్రతీకలని పేర్కొన్నారు. ఇఫ్తార్ విందు కార్యక్రమాలు పరమత సహనానికి ప్రతీకలుగా నిలుస్తాయని తెలిపారు. ప్రజలు సుఖసంతోషాలతో రంజాన్ వేడుకలను జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నేత రామేశ్వర్ గౌడ్, మసీద్ కమిటీ ప్రతినిధులు, స్థానిక మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.



# భీమేశ్వర స్వామి సేవలో మంత్రి అడ్లూరి

- పూర్ణకుంభ స్వాగతం పలికిన అర్చకులు
- శేష వస్త్రం, లడ్డూ ప్రసాదం అందజేత



**ప్రజానావ, వేములవాడ:** వేములవాడలోని రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన భీమేశ్వర స్వామివారిని మంత్రి, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మంగళవారం దర్శించుకుని పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు, వేద పండితులు మంత్రికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి కోడె మొక్కులు చెల్లించుకున్నారు. తర్వాత స్వామివారి మండపంలో అర్చకులు, వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఏఈవో జి. శ్రావణ్ కుమార్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు స్వామివారి శేష వస్త్రం, లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. మంత్రి వెంట సిరిసిల్ల ఏఎస్పీ చంద్రయ్య, వేములవాడ డీఎస్పీ శ్రీనివాస్, ఎమ్మార్వో జయంత్, ఆలయ పర్యవేక్షకులు జి. శ్రీనివాస్ శర్మ, ఎడ్ల శివసాయి, జూనియర్ అసిస్టెంట్ సింహాచారి, జూనియర్ అసిస్టెంట్ నరాల రాజు, ఆలయ ఉద్యోగులు, వేద పండితులు పాల్గొన్నారు.

# సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు

- ఉగాది సందర్భంగా పంచాంగ శ్రవణం నిర్వహణ

**ప్రజానావ, వేములవాడ:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించనున్న సీతారాముల కల్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. శ్రీరామనవమి సందర్భంగా ఈ నెల 27న ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. అలాగే ఉగాది పండుగ సందర్భంగా 19న సాయంత్రం 4:30 గంటలకు పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా జిల్లావ్యాప్తంగా పోస్టర్ల పంపిణీ చేపట్టారు. ఆలయ ప్రాంగణంలోని ప్రొటోకాల్ కార్యాలయంలో మొదటి వాల్ పోస్టర్‌ను ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్లు నరాల రాజు, సింహాచారి తదితర ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.





# ‘రేవంతన్నా కా సహారా- మిస్కీన్’కు లబ్ధిదారుల ఎంపిక

**ప్రజానావ, సిరిసిల్ల :** తెలంగాణ మైనారిటీల సంక్షేమం కోసం మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం పొందుపరచిన లిరేవంతన్నా కా సహారా–మిస్కీన్‌ల కోసం” పథకం కోసం లబ్ధిదారుల ఎంపిక ను మంగళవారం నిర్వహించారు. జిల్లాలోని ఫఖీర్, దూదేకుల, దూదేకుల ముస్లిం కమ్యూనిటీ అభ్యున్నతి, సంక్షేమం కోసం ఫఖీర్, దూదేకుల ముస్లిం కమ్యూనిటీ సభ్యులకు మోపెడ్‌లు, బైక్, ఈ–బైక్‌లను అందించేందుకు జిల్లాకు కేటాయించిన లక్ష్యం (5) అనుసారంగా ఐదుగురు లబ్దిదారులను జిల్లా స్క్రీనింగ్ కం సెలక్షన్ కమిటీ సభ్యుల సమక్షంలో కమిటీ చైర్మన్ జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి భారతి తదితరులు ఉన్నారు.

# ఐసీయూలో రోగి చేతిని ఎలుక కొరికిన ఘటనపై విచారణ కమిటీ

## వైద్యుడు, నర్సు సస్పెండ్

**ప్రజానావ, ముంబై:** ముంబైలోని భయందర్ వెస్ట్ ప్రాంతంలోని పండిట్ భీమ్‌సేన్ జోషి ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన ఘటన తీవ్ర సంచలనం రేపింది. ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ)లో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న 89 ఏళ్ల వృద్ధురాలి చేతిని ఎలుక కరిచిన ఘటన వెలుగులోకి వచ్చింది. అనంతరం ఆ మహిళ సోమవారం సాయంత్రం మృతి చెందింది. మృతురాలిని సుహాసిని మాతేకర్‌గా గుర్తించారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, గుండెపోటు కారణంగా ఆమెను మార్చి 12న ఆసుపత్రిలో చేర్చినట్లు సమాచారం. చికిత్స పొందుతున్న సమయంలో ఎలుక కరిచిన ఘటన ఆసుపత్రి భద్రతా వ్యవస్థపై తీవ్ర అనుమానాలను కలిగిస్తోంది. ఈ ఘటనపై ఆసుపత్రి యాజమాన్యం నిర్లక్ష్యం వహించిందని మృతురాలి కుమార్తె మీనాల్ మాతేకర్–దేశాయ్ ఆరోపించారు. ఇదిలా ఉండగా, మీరా–భయందర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ డింపుల్ మెహతా, డిప్యూటీ మేయర్ ధ్రువకిషోర్ పాటిల్ ఆసుపత్రిని సందర్శించి ఘటనపై వివరాలు తెలుసుకున్నారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ చేపట్టేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

# లోకల్ రైలు కిందకు తోసి భార్యను హత్య చేసిన భర్త

## ములుండ్‌లో దారుణ ఘటన.. ఫిర్యాదు చేసినందుకు కక్ష

## - 20 గంటల్లోనే నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

**ప్రజానావ, ముంబై:** ముంబైలోని ములుండ్ ప్రాంతంలో భార్యను నడుస్తున్న లోకల్ రైలు కిందకు తోసి హత్య చేసిన సంఘటన తీవ్ర కలకలం రేపింది. తనపై పోలీసులకు ఫిర్యాదు చేసిందన్న కక్షతో భర్త రాజు గుప్తా, భార్య పుష్పా గుప్తాను రైలుకిందకు తోసి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలు పుష్పా గుప్తా కాగా, కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ ఘటన జరిగినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. భర్త తరచూ హింసకు పాల్పడడంతో విసిగిపోయిన పుష్పా, ములుండ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పుష్ప బాధలను గమనించిన ఆమె బావ, భారత సైన్యంలో సైనికుడైన కమలేష్ గుప్తా, ఆమెను సురక్షితంగా గ్రామానికి తీసుకెళ్లేందుకు ముంబైకి వచ్చాడు. సోమవారం ఇద్దరూ ములుండ్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. అయితే ముందుగానే కమలేష్ సైనిక గుర్తింపు కార్డును రాజు గుప్తా దొంగిలించి దాచిపెట్టాడు. దాన్ని తెచ్చుకోవడానికి కమలేష్ తిరిగి ఇంటికి వెళ్లాడు. ఈ సమయంలో రాజు గుప్తా, తన కుమారుడు ఆర్యన్‌తో కలిసి కమలేష్‌ను ఇంట్లో బంధించి, వెంటనే రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. ప్లాట్‌ఫారమ్‌పై ఉన్న పుష్పకు ఏమి జరిగిందో తెలియకముందే, ఎదురుగా వస్తున్న లోకల్ రైలు కిందకు తోసివేయడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. ఘటనపై సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాలపై దర్యాప్తు చేపట్టి, సీనియర్ అధికారుల మార్గదర్శకత్వంలో కేవలం 20 గంటల్లోనే నిందితుడు రాజు గుప్తాను అరెస్టు చేశారు. అతనిపై హత్య కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ఉద్యోగాల పేరుతో మోసపోవద్దు

## డా. కె. శ్రీధర్.. వారధి సొసైటీ ద్వారానే అవుట్‌సోర్సింగ్ నియామకాలు



**ప్రజానావ, పెద్దపల్లి:** పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాల నియామకాలు జిల్లా కలెక్టర్ నేతృత్వంలో వారధి సొసైటీ ద్వారా మాత్రమే జరుగుతాయని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ తెలిపారు. ఉద్యోగం కావాలనుకునే ఆశావహులు కలెక్టర్ కార్యాలయం లోని వారధి సొసైటీలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. మధ్యవర్తులు, దళారులు చెప్పే మాటలు విని ఎవరూ మోసపోవద్దని ఆయన ఒక ప్రకటనలో హెచ్చరించారు.

### దళారుల మాటలు నమ్మకండి

ఎవరైనా ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి డబ్బులు అడిగితే అస్సలు నమ్మవద్దని శ్రీధర్ స్పష్టం చేశారు. కేవలం వారధి సొసైటీ ద్వారానే పారదర్శకంగా నియామకాలు ఉంటాయని గుర్తు చేశారు. ఇలాంటి మోసపూరిత వాగ్దానాలకు ప్రజలు దూరంగా ఉండాలని కోరారు. పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి సర్వదా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. తమ సిబ్బంది ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని వెల్లడించారు.

# సాహిత్యం గంగా ప్రవాహం లాంటిది



- భవిష్యత్ తరాలకు మార్గదర్శకులుగా నిలవాలి
- ఉగాది కవి సమ్మేళనంలో డీఎస్పీ నాగేంద్ర చారి పిలుపు

**ప్రజానావ, సిరిసిల్ల :** గంగా ప్రవాహం లాంటి సాహిత్యం నిరంతరం కొనసాగాలని డీఎస్పీ నాగేంద్ర చారి ఆకాంక్షించారు. సమాజ హితమే లక్ష్యంగా కవితలు, రచనలతో భవిష్యత్ తరాలకు మార్గదర్శకులుగా నిలవాలని పిలుపునిచ్చారు. సిరిసిల్ల సాహితీ సమితి, మానేరు స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా మంగళవారం ఉగాది కవి సమ్మేళనం నిర్వహించారు. స్థానిక గాంధీ నగర్ లోని భక్త వితలేశ్వర హనుమాన్ దేవాలయంలో జరిగిన కవి సమ్మేళనానికి డీఎస్పి కె నాగేంద్రాచారి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నేటి యువత పెడదారి పట్టకుండా సన్మార్గంలో నడిపించేలా చూడాల్సిన బాధ్యత కవులపై ఉందన్నారు. సమాజానికి దిశా నిర్దేశం చూపేది కవులు రచయితలేనని పేర్కొన్నారు. అందుకు ఎనలేని కృషి చేస్తున్న కవులను ప్రశంసించారు. కార్మిక క్షేత్రమైన సిరిసిల్ల జిల్లా కేంద్రంలో గతంలో నేత కార్మికుల ఆకలి చావులు, ఆత్మహత్యలు జరిగితే కవుల సహకారంతో ఆత్మహత్యలు వద్దు, అండగా మేమున్నామంటూ రకరకాల కొటేషన్లు గోడలపై రాయడం జరిగిందన్నారు. గోడల పై రాసిన రాతలే సమాజాన్ని ప్రభుత్వాన్ని కదిలించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. సమాజంలో జరుగుతున్న నేరాలు, గోరాలు ఇతరత్ర హింస కార్యక్రమాలను అరికట్టాలంటే తమ రచనలు, కవితల ద్వారా అవగాహన కల్పించాలని, అప్పుడే చైతన్యవంతులై సన్మార్గంలో నడుస్తారని సూచించారు. కవి సమ్మేళనాలతో పండుగల విశిష్టతను, సంస్కృతి సాంప్రదాయాలను తెలిపే విధంగా కార్యక్రమాలు జరగాలన్నారు. అవధానులు, శతావధానులు ఎందరో మన తెలుగు భాషను పరిరక్షిస్తూ, సంస్కృతి వైపు ముందుకు నడిపిస్తున్న మహానుభావులను ఉగాది సందర్భంగా గుర్తు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. భాష, వేషం మారుతున్న ఈ కాలంలో మన సాంప్రదాయాలను కాపాడుకునేలా అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మానేరు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు డాక్టర్ చింతోజు భాస్కర్ మాట్లాడుతూ డ్రగ్స్‌కు అలవాటు పడుతున్న యువతకు అవగాహన కల్పించాలని కోరారు. నేటి యువత మత్తు పదార్థాలకు బానిసలై నేరాలకు పాల్పడుతున్నారని, దీంతో ప్రమాదాలకు లోనై తల్లులకు గర్భశోకాన్ని మిగిల్చకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందని పేర్కొన్నారు. సమాజ సంక్షేమం కోసం పాటుపడా అన్నారు. మానేరు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గత 18 సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా పర్యావరణాన్ని రక్షించాలని ఉద్దేశంతో మొక్కలు నాటడమే కాకుండా ప్లాస్టిక్ నివారణకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. వినాయక ఉత్సవాలలో మట్టి ప్రతిమలను ఏర్పాటు చేసేలా తాము ఉచిత గణపతులను పంపిణీ చేసి నట్లు తెలిపారు. రాసే కవితలు, రచనలు సమాజాన్ని ఆలోచింపచేసేలా ఉండాలని, భవిష్యత్ తరాలకు ఒక దిక్సూచిలా నిలవాలన్నారు. పుస్తక పఠనం దారి తప్పుతుందని, సెల్ ఫోనుకు అలవాటు పడి చదవడం మర్చిపో చదవడం మర్చిపోయే పరిస్థితి నెలకొందన్నారు. పిల్లలను చిన్నప్పటినుండే సంస్కారవంతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని గుర్తు చేశారు. అందులో భాగంగా కవులు కూడా తమ వంతు కృషి చేయాలని సూచించారు. ఈ కవి సమ్మేళనంలో డీఎస్పి నాగేంద్ర చారి తో పాటు కవులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల సాహితీ సమితి గౌరవ అధ్యక్షులు పోరండ్ల మురళీధర్, వెంగళ లక్ష్మణ్, నేరోజు రమేష్, ఆడెపు లక్ష్మణ్, కోడం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పట్టణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- మహాలక్ష్మి కమాన్ సిసి రోడ్డు పనుల పరిశీలన
- మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు



**ప్రజానావ, వేములవాడ :** వేములవాడ పట్టణాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తామని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అన్నారు. పట్టణంలోని నాలుగో వార్డులో గల మహాలక్ష్మి కమాన్ నుండి జమ్మిచెట్టు వరకు చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, స్థానిక కౌన్సిలర్ తోట రాజు, కాంగ్రెస్ పార్టీ నేతలతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో వేములవాడ పట్టణ రూపురేఖలు మారుతున్నాయని కొనియాడారు. ప్రజల సౌకర్యార్థం వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నామని తెలిపారు. రోడ్డు నిర్మాణ పనుల్లో ఎక్కడా రాజీ పడకుండా నాణ్యతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. అభివృద్ధి లక్ష్యంగా పట్టణాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కొండ రాజశేఖర్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

### 25వ వార్డులో పరిశీలన :

ప్రభుత్వ 99 రోజుల ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా 25వ వార్డులో నిర్వహిస్తున్న పారిశుధ్య స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని స్థానిక కౌన్సిలర్ కొక్కుల బాలకృష్ణతో కలిసి ఆయన స్వయంగా పర్యవేక్షించారు. వార్డులోని మురికి కాల్వలను శుభ్రం చేసే పనులను దగ్గరుండి పరిశీలించిన చైర్మన్, పనులపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.

# 100 శాతం పన్నులు వసూలు చేయాలి

- పారిశుద్ధ్య పనులు పక్కాగా చేయాలి
- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు, టీపీవోలు ఇతర అధికారులతో సమీక్ష



**ప్రజానావ, సిరిసిల్ల :** సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధిలో ఇంటి, భవనాల పన్ను 100 శాతం వసూలు చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక అమలు, ఇంటి పన్ను వసూలు, పారిశుధ్య పనులు, నీటి సరఫరా, మున్సిపల్ బడ్జెట్, తదితర అంశాలపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు, టీపీవోలు ఇతర అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో ఇంటి, భవనాల పన్ను లక్ష్యం రూ. 6 కోట్ల 99 లక్షలు కాగా, ఇప్పటిదాకా రూ.5 కోట్ల 66 లక్షలు వసూలు అయ్యాయని, వేములవాడ మున్సిపల్ పరిధిలో రూ.4 కోట్ల 54 లక్షలు లక్ష్యం కాగా, రూ.3 కోట్ల 18 లక్షలు వసూలు అయ్యాయని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ లక్ష్యం మేరకు పన్నులు వసూలు చేయించాలని ఆదేశించారు. దీంతో 15 వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు అవుతాయని తెలిపారు. రెండు మున్సిపాలిటీల పరిధిలో నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని సూచించారు. బోర్లకు మరమ్మత్తు చేయించాలని, పైప్ లైన్ లీకేజీ లేకుండా చూడాలని ఆదేశించారు. పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. పబ్లిక్ పార్క్ ల నిర్వహణ పై ప్రత్యేక దృష్టి సారించాలని, స్వచ్ఛంగా.. పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. ఏబీసీ కేంద్రాలను ప్రారంభించాలని సూచించారు. సెగ్రిగేషన్ షెడ్లు వినియోగంలోకి తీసుకురావాలని, తడి, పొడి చెత్త వేరు చేయాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఆడిట్ అధికారి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# టిక్కెట్‌లేని ప్రయాణికులపై కఠిన చర్యలు

## కోటి రూపాయల జరిమానా వసూలు

## ముంబై సెంట్రల్ రైల్వే డివిజన్‌లో చారిత్రాత్మక రికార్డు

## 11,483 మంది ప్రయాణికుల నుంచి రూ.1.03 కోట్ల వసూళ్లు

**ప్రజానావ, ముంబై:** ముంబైలో రోజూ లక్షలాది మంది రైళ్లలో ప్రయాణిస్తుండగా, టిక్కెట్ లేకుండా ప్రయాణించే వారి సంఖ్య కూడా గణనీయంగా ఉంది. ఈ నేపథ్యంలో సెంట్రల్ రైల్వే ముంబై డివిజన్‌లో టిక్కెట్ తనిఖీలను కఠినతరం చేస్తూ చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ (సీటీఐ) మహమ్మద్ షమ్స్ అరుదైన రికార్డు సృష్టించారు. ప్రస్తుత 2025–26 ఆర్థిక సంవత్సరంలో విధి నిర్వహణలో భాగంగా టిక్కెట్ లేని ప్రయాణికులపై కఠిన చర్యలు తీసుకున్న ఆయన, జరిమానాల రూపంలో కోటి రూపాయల మార్కును దాటి చారిత్రాత్మక ఘనత సాధించారు. ఈ రికార్డును సాధించిన తొలి టికెట్ ఇన్‌స్పెక్టర్‌గా ముంబై డివిజన్‌లో నిలిచారు. అధికారిక సమాచారం ప్రకారం, ఏప్రిల్ 1, 2025 నుంచి మార్చి 14, 2026 వరకు సుమారు పదకొండున్నర నెలల కాలంలో మహమ్మద్ షమ్స్ మెొత్తం 11,483 మంది టిక్కెట్‌లేని ప్రయాణికులను గుర్తించారు. వీరి నుంచి రూ. 1.03 కోట్ల జరిమానాను వసూలు చేసి రైల్వే ఖజానాలో జమ చేశారు. ఆయన కృషిని ముంబై సీఆర్ డివిజన్ డీఆర్ఎం ప్రత్యేకంగా అభినందించారు. రైల్వే పరిపాలన విభాగం సోషల్ మీడియా ద్వారా షమ్స్ విజయాన్ని ప్రశంసిస్తూ, ఈ ఘనత ఇతర ఉద్యోగులకు స్ఫూర్తినిస్తుందని పేర్కొంది. రైల్వే ఆదాయాన్ని పెంచడం, టిక్కెట్‌లేని ప్రయాణాలను అరికట్టడంలో ఆయన చూపిన చురుకుదనం ప్రశంసనీయమని అధికారులు తెలిపారు.

# పోలీసు సిబ్బందికి వైద్య పరీక్షలు

## జూలపల్లి పోలీస్ స్టేషన్‌లో నిత్య డయాగ్నొస్టిక్ సెంటర్ ఆధ్వర్యంలో రక్త పరీక్షలు



**ప్రజానావ, పెద్దపల్లి:** జూలపల్లి మండలం బాలరాజుపల్లి ఉపసర్పంచ్ కోరుకంటి హరికిషన్, పెద్దపల్లి నిత్య డయాగ్నొస్టిక్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో జూలపల్లి పోలీస్ స్టేషన్‌లో సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులకు రక్త పరీక్షలు చేసి ఆరోగ్య సూచనలు అందజేశారు. హరికిషన్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కష్టపడే పోలీస్ సిబ్బంది తమ ఆరోగ్య సంరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కఠినమైన విధుల్లో నిమగ్నమై ఉండటం వల్ల వారికి సాధారణ వ్యాయామానికి కూడా సమయం దొరకకపోవడాన్ని గుర్తించామన్నారు. సంపూర్ణ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ప్రతి ఒక్కరికీ అవసరమని, అందుకే పోలీసు సిబ్బంది అందరికీ ఈ పరీక్షలు నిర్వహించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అశోక్, మహేందర్, తిరుపతి, రాకేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. సామాజిక బాధ్యతగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన నిత్య డయాగ్నొస్టిక్ సెంటర్ యాజమాన్యాన్ని జూలపల్లి సబ్ ఇన్‌స్పెక్టర్ సనత్ కుమార్ శాలువాతో సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు.

# నాళేశ్వర్ మాటు కాల్వను పరిశీలించిన అధికారులు

## ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆదేశాలతో క్షేత్రస్థాయిలో అంచనాల రూపకల్పన

## త్వరలోనే మరమ్మతులు.. వరద ముంపు నుంచి రైతులకు విముక్తి



**ప్రజానావ, నిజామాబాద్:**

నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం అంకంపల్లి, నాళేశ్వర్ పొలాల మధ్య ఉన్న మాటు కాల్వను మంగళవారం మండల అధికారులు పరిశీలించారు. మరమ్మతులకు అయ్యే బడ్జెట్ అంచనాలను రూపొందించారు. ఈ మాటు కాల్వ లోతు పూడికపోయి ఉండటం, చుట్టుపక్కల మాటు భూమి తగ్గడంతో వర్షాకాలంలో వచ్చే నీటి ప్రవాహంతో పంట భూములు మునిగిపోతున్నాయి. దాంతో పాటు గ్రామంలోకి ఆ వరద నీరు భారీగా చేరుతోంది. ఈ తీవ్రమైన సమస్యను నాళేశ్వర్ గ్రామ సర్పంచ్.. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి గారి దృష్టికి తీసుకువెళ్లి కాల్వకు మరమ్మతులు చేయాలని విన్నవించారు. ఎమ్మెల్యే గారు వెంటనే స్పందించి ఇరిగేషన్, పంచాయతీ రాజ్ అధికారులను నాళేశ్వర్ గ్రామానికి పంపించారు. మాటు కాల్వ పరిస్థితిని చూసి మరమ్మతులకు అయ్యే అంచనా బడ్జెట్ సిద్ధం చేయాలని, త్వరగా పనులు ప్రారంభించాలని ఆదేశించారు. దీంతో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలన పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ బాలరామ్, ఏఈ శ్రీధర్, పంచాయతీ రాజ్ డీఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. నాళేశ్వర్ సర్పంచ్ ఆర్మూర్ లావణ్య, ఉప సర్పంచ్ ఆర్మూర్ శ్రీనివాస్, వార్డు సభ్యులు కిషాన్ రాజు, గణేష్ హాజరయ్యారు. వీరితో పాటు మాజీ సర్పంచ్ లు తిమ్మపురం సాయారెడ్డి, మగ్గరి నర్సింగ్ రావు, మాజీ సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మండ్లు పాల్గొన్నారు. బెల్లాల్ నర్సింగ్ రావు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు గంగాధర్, లక్ష్మణ్, కొండయ్య, జనార్ధన్ ఇతర గ్రామస్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాల్వ పనులు వేగంగా మొదలైతే ముంపు సమస్య తీరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# రంజాన్ ఏర్పాట్ల పరిశీలన

## ముస్లింలకు మున్సిపల్ చైర్మన్ ముందస్తు శుభాకాంక్షలు

## ఈద్గా వద్ద పనులను పర్యవేక్షించిన నూగిల్ల మల్లయ్య

**ప్రజానావ, పెద్దపల్లి:**

పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని ఈద్గా వద్ద మున్సిపల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జరుగుతున్న పారిశుధ్య పనులను మంగళవారం పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ముస్లిం సోదరులు నమాజ్ కు వచ్చే సమయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో శానిటేషన్, త్రాగునీరు, టెంట్లు, కార్పెట్లు వంటి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ముస్లిం సోదర సోదరీమణులు ఆహ్లాదకరమైన వాతావరణంలో పండుగ జరుపుకోవాలని కోరుతూ వారికి ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అస్లాం పర్వేజ్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ సతీష్, వార్డు ఆఫీసర్ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పులిపాక రాజు, నాయకుడు అజ్గర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# మత స్వేచ్ఛ చట్టం కింద తొలి కేసు నమోదు

## మహారాష్ట్రలోని ఇగత్‌పురిలో మైనర్‌పై వేధింపుల కేసు కలకలం

## మత మార్పిడుల నియంత్రణకు కొత్త చట్టానికి అసెంబ్లీ ఆమోదం




**ప్రజానావ, ముంబై:** మహారాష్ట్రలో మత మార్పిడుల నియంత్రణకు రూపొందించిన 'మహారాష్ట్ర మత స్వేచ్ఛ చట్టం-2026' కింద తొలి కేసు నమోదైంది. ఇటీవల రాష్ట్ర శాసనసభలో ఈ బిల్లు మెజారిటీ ఓట్లతో ఆమోదం పొందగా, నాసిక్ జిల్లా ఇగత్‌పురిలో ఈ చట్టం కింద మొదటి కేసు నమోదు కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. మంత్రి పంకజ్ భోయర్ అసెంబ్లీలో ఈ బిల్లును ప్రవేశపెట్టగా, చర్చ అనంతరం ఆమోదం లభించింది. బిల్లును సంయుక్త కమిటీకి పంపే ప్రతిపాదనకూ సభ ఆమోదం తెలిపింది. దీంతో చట్టానికి సూత్రప్రాయంగా గ్రీన్ సిగ్నల్ లభించింది. ఇగత్‌పురిలో నమోదైన తొలి కేసు వివరాల ప్రకారం, నిందితుడు స్నేహం పేరుతో బాధితురాలి నమ్మకాన్ని సంపాదించి తన మతాన్ని దాచిపెట్టి మోసం చేసి, లైంగికంగా వేధించినట్లు ఆరోపణలు ఉన్నాయి. 2022లో బాధితురాలు మైనర్‌గా ఉన్న సమయంలో అత్యాచారం జరిగినట్లు ఫిర్యాదు నమోదైంది. కపాలేశ్వర ఆలయ పరిసరాలకు పిలిచి బెదిరించాడని కూడా ఆరోపణలు ఉన్నాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు, నిందితుడు కుటుంబాన్ని చంపేస్తానని బెదిరిస్తూ లైంగిక వేధింపులకు గురిచేశాడని పేర్కొన్నారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో బలవంతంగా ప్రవేశించి అత్యాచారం చేసినట్లు ఆరోపించారు. అలాగే మతం మారాలని పదేపదే ఒత్తిడి తీసుకువచ్చినట్లు 19 ఏళ్ల బాధితురాలు పోలీసులకు తెలిపింది. ఈ కేసులో ముస్తఫా షేక్‌పై పోలీసులు భారతీయ శిక్షాస్మృతి-2023లోని సెక్షన్లు 64(2)(డి), 329(2), 351(2) కింద కేసు నమోదు చేశారు. బాధితురాలు మైనర్‌గా ఉన్న సమయంలో జరిగిన ఘటనకు సంబంధించి పోక్సో చట్టం కింద కూడా కేసు నమోదైంది. ప్రస్తుతం పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

### ప్రత్యేక చట్టం అవసరం: ఫడ్నవీస్

ఇదిలా ఉండగా, ఈ చట్టంపై ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడుతూ, మత మార్పిడుల కారణంగా శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో ప్రత్యేక చట్టం అవసరమని పేర్కొన్నారు. బలవంతపు, మోసపూరిత, ప్రలోభపెట్టి చేసే మత మార్పిడులను నిరోధించడమే ఈ చట్టం లక్ష్యమని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛను కాపాడడమే దీని ఉద్దేశ్యమని అన్నారు. ఈ చట్టం ప్రకారం అక్రమ మత మార్పిడికి పాల్పడితే సంబంధిత వ్యక్తులు లేదా సంస్థలు శిక్షార్హులు అవుతారు. బలవంతపు మత మార్పిడిపై బాధితుడితో పాటు రక్త సంబంధీకులకు కూడా ఫిర్యాదు చేసే హక్కు కల్పించారు. అలాగే అనుమానం ఉన్న సందర్భాల్లో పోలీసులు స్వయంగా కేసులు నమోదు చేయవచ్చని పేర్కొన్నారు.

# వరి ధాన్యం కొనుగోళ్లు సజావుగా చేయాలి

## కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

## యాసంగి సీజన్ ధాన్యం కొనుగోళ్లపై కేంద్రాల బాధ్యులు, అధికారులతో సమీక్షలో కలెక్టర్ గరిమ అగ్రవాల్



**ప్రజానావ, సిరిసిల్ల :** వరి ధాన్యం కొనుగోళ్లు సజావుగా చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. యాసంగి సీజన్ (2025-26) ధాన్యం కొనుగోళ్లపై వివిధ శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లోని ఆడిటోరియంలో కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో తప్పనిసరిగా టెంట్లు, తాగు నీరు, విద్యుత్ వసతి కల్పించాలని, టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, తూకం వేసే యంత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు.పథాన్యం తూకంలో పారదర్శకంగా ఉండాలని, నిర్దేశించిన విధంగా కొనుగోళ్లు చేయాలని సూచించారు. రైతులు తాము కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని పిలుపు నిచ్చారు. రైతులు తమ ధాన్యాన్ని తాలు, తప్ప లేకుండా, తేమ శాతం 17 ఉండేలా చూసుకుని కేంద్రాలకు తరలించాలని సూచించారు. నిబంధనల మేరకు రైతులు తమ ధాన్యాన్ని శుభ్రంగా తీసుకువచ్చి, మద్దతు ధర పొందాలని సూచించారు. జిల్లాలోని 13 మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం జిల్లా లో ఈ సీజన్లో దాదాపు 2.70 లక్షల నుంచి 3.00 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రానుందని వెల్లడించారు. ధాన్యాన్ని సేకరించేందుకు పీఏసీఎస్ ఆధ్వర్యంలో 74,హొఐకేపీ ఆధ్వర్యంలో 158, మెప్మా ఆధ్వర్యంలో7, డీసీ ఎంఎస్ ఆధ్వర్యంలో 1 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నట్లు వివరించారు.. రైతులకు టోకెన్లు ఇవ్వాలని, దాని ప్రకారంహొ

కొనుగోళ్లు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ గీత, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బుచ్చిబాబు, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ నరసింహ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, సహకార అధికారి రామకృష్ణ, మార్కెటింగ్ అధికారి ప్రకాశ్, కార్మిక శాఖ అధికారి నజీర్ అహ్మద్, అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే భూ నిర్వాసితులతో సమావేశం

## పరిహారం పెంచాలంటూ ఆర్డీవోకు బాధితుల వినతి

**ప్రజానావ, వేములవాడ :** కొత్తపల్లి – మనోహరాబాద్ రైల్వే భూనిర్వాసితులతో మంగళవారం వేములవాడ ఆర్డీవో రాధాభాయి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని వేములవాడ, లక్ష్మిపురం, నాంపల్లి అనుపురం గ్రామ భూనిర్వాసితులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వాసితులు తమ సమస్యలను ఆర్డీవోకు విన్నవించారు. కోట్ల విలువ చేసే భూములు కోల్పోతున్నామని, ప్రభుత్వం ఇస్తామంటున్న పరిహారం వల్ల తీవ్రంగా నష్టం జరుగుతుందన్నారు. బహిరంగ మార్కెట్ విలువను పరిగణనలోకి తీసుకుని పరిహారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ జయంత్ కుమార్, రైల్వే భూ నిర్వాసితులు పాల్గొన్నారు.





